సాక్షి నంద్యాల

శనివారం । 31 । ఆగస్టు । 2024



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవా రం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి సహస్రనామ పూజలు జరిపించారు.



కొత్త పింఛన్లకు చంద్రగ్రహణం

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏరాటై 80 రోజులు గడుస్తున్నా 50 ఏళ్ల నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తామనే హామీ అమలు కాలేదు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,630
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 95
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 34,083
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:10,067

న్యూస్‌రీల్

పర్యవేక్షణాధికారిగా పోలా భాస్కర్



నంద్యాల(అర్బన్): జిల్లాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించింది. అందులో భాగంగా నంద్యాల జిల్లాకు బీసీ సంక్షేమ శాఖ కార్య దర్శి పోలా భాస్కర్ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాదు జీఓ ఆర్‌టీనంబర్ 1495ను విడుదల చేశారు. త్వ రలోనే వీరు జిల్లాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకుంటారు.

నేడు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

నంద్యాల(అర్బన్): ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను ఈ నెల 31వ తేదీ (నేడు) ఇంటింటికీ పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పెన్షన్ల పంపిణీపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబరు 1 ఆదివారం సెలవు రోజు కావడంతో ఆగస్టు 31న ఇంటింటికీ తిరిగి పెన్షన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లాలో 2,19,046 మందికి వివిధ కేటగిరీల్లో పెన్షన్ల కింద రూ.92.56 కోట్ల లబ్ధి చేకూరుతుందన్నారు. పెన్షన్ల పంపిణీకి దాదాపు 8,800 మంది సచివాలయ సిబ్బందితో పాటు ఇతర శాఖల సిబ్బందిని కూడా వినియోగిస్తున్నామన్నారు. పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులకు కూడా ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. ఉదయం 6 గంటలకు అన్ని సచివాలయాల పరిధిలో పెన్షన్ల పంపిణీని ప్రారంభించి అదేరోజు సాయంత్రానికి నూరుశాతం పెన్షన్ల పంపిణీ పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా లబ్ధిదారులు పెన్షన్లు అందుకోని పక్షంలో సెప్టెంబరు 2వ తేదీన పూర్తి స్థాయిలో అందించాలన్నారు.

3 నుంచి 'పొలం పిలుస్తోంది'


- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(రూరల్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల 3వ తేదీ నుంచి జిల్లాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మంగళవారం, బుధవారం వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్లి నూతన పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులు, పంటల మార్పిడి, ఎరువుల వాడకం తదితర వాటిపై వివరించి రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, పశుసంవర్ధక అధికారి గోవింద నాయక్, మార్కెటింగ్ ఏడీ రెహమాన్, వ్యవసాయ సాంకేతిక అధికారి అయూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

'విభజన తర్వాత ఏర్పడిన రాష్ట్రానికి తొలి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆగస్టు 15న కర్నూలులో నిర్వహించారు. మువ్వన్నెల జెండా సాక్షిగా జిల్లా అభివృద్ధికి పదేళ్ల కిందట 15 హామీలను వల్లెవేశారు. ఐదేళ్ల ప్రభుత్వంలో ఒక్కటీ అమలు చేయలేకపోయారు.



'హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని 2014–19లో పలుమార్లు సీఎం హోదాలో చంద్రబాబు ప్రకటించారు. ఆ ఐదేళ్లలో ఏర్పాటు చేయలేకపోయారు. 2019 తర్వాత 'న్యాయ రాజధాని'పై గత ప్రభుత్వం ప్రకటన చేస్తే దాన్నీ వ్యతిరేకించారు'



'గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏపీఈఆర్సీ, లోకాయుక్త, మానవహక్కుల కమిషన్, వక్ఫ్‌ట్రిబ్యునల్, సీబీఐ కోర్టులు అమరావతికి తరలించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అలాగే హైకోర్టును అమరావతిలోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. దీంతో దశాబ్దాలుగా రాయలసీమకు జరిగిన అన్యాయానికి న్యాయం జరుగుతుందని భావించే సమయంలో చంద్రబాబు మళ్లీ అన్యాయం చేశారు.'



'పత్తికొండ, డోన్, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో 77 చెరువులకు గత ప్రభుత్వం నీరు అందించింది. దీంతో రైతులు పంటలు సాగు చేసుకున్నారు. ఈ ఏడాది రెన్నెల్లుగా శ్రీశైలానికి పుష్కలంగా నీరు వస్తున్నా ఒక్క చెరువుకూ ప్రభుత్వం నీరు ఇవ్వలేకపోయింది.



... ఈ నాలుగు ఉదాహరణలు చూస్తే కర్నూలు జిల్లా అభివృద్ధి, ప్రజల శ్రేయస్సుపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఆయన ప్రభుత్వానికి ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతుంది.

ఎగురవేసి.. ఎగవేసి!



2014 స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో 15 హామీలు

- ఆ ఐదేళ్లలో ఒక్కటీ అమలు చేయని ప్రభుత్వం
- మరోసారి అధికారంలోకి వచ్చినా కర్నూలుపై చిన్నచూపు
- రెన్నెల్లుగా శ్రీశైలానికి నీరు వస్తున్నా 77 చెరువులకు కన్నీళ్లు
- జిల్లాలో ఏర్పాటైన ప్రభుత్వ రంగ సంస్థలూ అమరావతికి తరలింపు
- కర్నూలు జిల్లా అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు
- నేడు ఓర్వకల్లులో సీఎం పర్యటన

2014 ఆగస్టు 15న కర్నూలులో చంద్రబాబు ఇచ్చిన అమలు కాని హామీలు

- శ్రీశైలంలో పులుల పార్క్, ఆలూరులో జింకల పార్కు, నందికొట్కూరులో పక్షుల సంరక్షణ కేంద్రం.
- కర్నూలులో నగరానికి ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం.
- రూ.150 కోట్లతో కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీకి శాశ్వత భవనాలు.
- ఆత్మకూరు జూనియర్ కళాశాలకు అధ్యాపక పోస్టులు.
- డోన్ సమీపంలో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైన్స్' ఏర్పాటు.
- కర్నూలు–బెంగళూరు మార్గాన్ని సూపర్ ఎక్స్‌ప్రెస్ మార్గంగా అభివృద్ధి చేయడం.
- కర్నూలు కార్పొరేషన్‌ను 'స్మార్ట్ సిటీ'గా అభివృద్ధి.
- కర్నూలు, నంద్యాల పట్టణాలు మహానగరాలుగా అభివృద్ధి.
- ఆదోని, ఎమ్మిగనూరులో ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ అప్పెరల్ పార్క్ ఏర్పాటు, అభివృద్ధి.
- కర్నూలులో మైనార్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు.
- కర్నూలులోని సర్వజన వైద్యశాలను 'రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్' స్థాయికి అభివృద్ధి చేయడం.
- నంద్యాలను 'సీడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా అభివృద్ధి.
- నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థను డీమ్డ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీగా అభివృద్ధి చేయడం.

సాక్షి ప్రతినిధి కర్నూలు: చంద్రబాబు ప్రజలను, జిల్లా అభివృద్ధిని రాజకీయ కోణంలో చూడటం మినహా ఎప్పుడూ మానవీయ కోణంలో చూడని పరిస్థితి. అందుకే అభివృద్ధిలో కర్నూలు జిల్లా ముందుకు కదల్లేకపోయింది. రాష్ట్ర విభజన తర్వాత 2014 ఆగస్టు 15న 'నవ్యాంధ్ర'లో తొలి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను కర్నూలులో నిర్వహించారు. ఈ వేడుకల్లో కర్నూలు అభివృద్ధికి వరాలు కురిపించారు. వాటిలో ఆ ఐదేళ్లు ఒక్క హామీని అమలు చేయలేకపోయారు. దీంతో 2019 ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో టీడీపీ ఉనికి లేకుండా పోయింది. 14 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాల్లో ఆ పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. అరచేతిలో వైకుంఠం చూపి తాజాగా మరోసారి టీడీపీ అధికారంలోకి వచ్చింది. కనీసం ఇప్పుడైనా గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని జిల్లా ప్రజలు కాంక్షిస్తున్నారు.

శ్రీశైలంలో నీరున్నా.. 77 చెరువులకు నీరివ్వని ప్రభుత్వం

పత్తికొండ నియోజకవర్గం లక్కసారం వద్ద పంప్ హౌస్ ఏర్పాటు చేసి పత్తికొండ, డోన్, పాణ్యం పరిధిలో 77 చెరువులకు హంద్రీ–నీవా నీటిని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించింది. రోజుకు 160 క్యూసెక్కుల చొప్పున 90 రోజుల్లో 1.24 టీఎంసీల హంద్రీ–నీవా జలాలతో చెరువులు నింపేలా పనులు చేశారు. డోన్ చరిత్రలో గతేడాది వరకూ ఒక్క ఎకరాకు కూడా నికరజలాలు లేవు. తొలిసారి గత ప్రభుత్వం నీరందించింది. వెల్దుర్తి, కల్లూరు మండలాల్లో 22 చెరువులకు, కృష్ణగిరి, తుగ్గలి, మద్దికెర, దేవనకొండ, పత్తికొండ మండలాల్లోని 14 చెరువులకు, ప్యాపిలి, డోన్ మండలాల్లో 19 చెరువులకు, జొన్నగిరి, డోన్, తుగ్గలి మండలాల్లోని మరో 7 చెరువులకు గతేడాది నీళ్లు అందించారు. డోన్ నియోజకవర్గంలో అదనంగా అవసరాన్ని బట్టి మరో 8 చెరువులకు కూడా నీరిచ్చే ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది రెన్నెల్లుగా శ్రీశైలానికి పుష్కలంగా నీరు వస్తోంది. అయితే ఇప్పటి వరకూ చెరువులకు నీరివ్వలేదు. టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ రోడ్డు పనుల కోసం హంద్రీ–నీవా కాలువను పూడ్చటంతో 20 రోజులు ఆలస్యంగా నీరు విడుదల చేశారు. ఆపై హంద్రీ–నీవా కాలువ తెగిపోవడంతో మరో 10 రోజులు నీరు ఆలస్యమైంది. ఇలా ప్రభుత్వానికి ముందు చూపులేకపోవడంతో రెన్నెల్లుగా శ్రీశైలానికి వరదనీరు వస్తున్నా జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు నింపుకోలేని పరిస్థితి. దీంతో పాటు చెరువులకు నీరిచ్చేందుకు మెయింటెనెన్స్ కోసం రూ.1.4కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులు విడుదల చేస్తేనే కాలువలకు మరమ్మతులు చేసి నీరు విడుదల చేసే అవకాశం ఉంటుంది. ఈ నిధులు కూడా ప్రభుత్వం విడుదల చేయకపోవడం గమనార్హం.

కర్నూలు అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు

శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం హైకోర్టు కర్నూలులో ఏర్పాటు చేయాలి. ఇది రాయలసీమ హక్కు. అయితే దీన్ని కూడా చంద్రబాబు నిర్మించలేకపోయారు. గత ప్రభుత్వం నిర్మాణానికి సిద్ధపడితే వ్యతిరేకించారు. చివరకు ప్రతిపక్షనేతగా కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చి 'హైకోర్టు అమరావతిలోనే ఉండాలి.. రాష్ట్రానికి ఒకే రాజధాని ఉండాలి..' అని ఇక్కడి టీడీపీ నేతలతో నినాదాలు చేయించారు. గత ప్రభుత్వం జిల్లాకు మేలు చేయాలనే సంకల్పంతో ఏపీఈఆర్సీకి శాశ్వత భవనం నిర్మించింది. లోకాయుక్త, మానవహక్కుల కమిషన్, వక్ఫ్‌ట్రిబ్యునల్, సీబీఐ కోర్టు ఏర్పాటు చేసింది. నేషనల్ లా యూనివర్సిటీకి భూమి కేటాయించి శంకుస్థాపన చేసింది. అయితే టీడీపీ ప్రభుత్వం హైకోర్టు అమరావతిలో నిర్మించడంతో పాటు ఇక్కడ ఇప్పటికే ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంస్థలన్నింటినీ అమరావతికి తరలించేందుకు సిద్ధమైంది. ఇలా అడుగడుగునా కర్నూలు అభివృద్ధికి చంద్రబాబు అడ్డుపడుతూనే ఉన్నారు.

ఫిట్‌నెస్ ధ్రువపత్రాల జారీ ప్రైవేటుకు

- సెప్టెంబర్ 2 నుంచి నంద్యాలలో అమలు

కర్నూలు: రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ (ఎఫ్‌సీ) ధ్రువపత్రాల జారీ బాధ్యతలు ఇక నుంచి ప్రైవేటు ఏజెన్సీ నిర్వహించనుంది. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి నంద్యాల జిల్లాకు సంబంధించి శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ బాధ్యతలు దక్కించుకుంది. అలాగే కర్నూలు జిల్లాకు సంబంధించి అనంతపురం జిల్లాకు చెందిన వసుధ ఎంటర్‌ప్రైజెస్ బాధ్యతలు దక్కించుకుంది. సంబంధిత సంస్థ కర్నూలు శివారులోని డోన్ జాతీయ రహదారిలో చిన్నటేకూరు గ్రామ సమీపంలో ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తోంది. అక్టోబర్ మొదటి వారం నుంచి ఇది అమలులోకి రానుంది. కర్నూలు, ఆదోని, నంద్యాల, డోన్, ఆత్మకూరు రవాణా శాఖ కార్యాలయాల్లో ట్రాన్స్‌పోర్టు వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను రవాణా శాఖ అధికారులు ఇచ్చేవారు. ప్రభుత్వ నిర్ణయంతో ట్రాన్స్‌పోర్టు వాహనాలు ఇకపై ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ల వద్దకు వచ్చి ధ్రువపత్రాలు పొందాల్సి ఉంటుంది. ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సదరు ఏజెన్సీ వారు స్లాట్‌లు కేటాయిస్తారు. దాని ప్రకారం ఏజెన్సీ (ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్) వద్దకు వెళ్తే ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్నదీ లేనిదీ వాహనాన్ని పరిశీలించి ధ్రువపత్రాలను జారీ చేస్తారు. ఉమ్మడి జిల్లాలో లారీలు, ఐచర్ వాహనాలు, బస్సులు, అంబులెన్స్‌లు, ట్యాక్సీ క్యాబ్, స్కూల్ బస్సులు, జీపులు, స్టేజ్ క్యారేజి బస్సులు, కార్లు తదితర గూడ్స్ వాహనాలు సుమారు 1.50 లక్షలు పైగా ఉన్నాయని, ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

జిల్లాలో మోస్తరు వర్షాలు

నంద్యాల(అర్బన్): జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఓ మోస్తారు వర్షాలు కురిశాయి. నందికొట్కూరు మండలంలో అత్యధికంగా 19.4 మి.మీ వర్షం కురవగా జూపాడుబంగ్లాలో 19.2, మిడుతూరులో 16.2, బండిఆత్మకూరు, గడివేములలో 15.2, పగిడ్యాలలో 14.0, మహానందిలో 13.2, కొత్తపల్లిలో 10.6, పాణ్యం 7.4, డోన్, ప్యాపిలి 6.4, వెలుగోడు 5.8, కోవెలకుంట్ల 5.6, పాములపాడు 5.4, ఆత్మకూరు 4.6, బేతంచెర్ల 4.2, ఉయ్యాలవాడ 3.6, ఆళ్లగడ్డ 3.2, బనగానపల్లె 2.8, గోస్పాడు, రుద్రవరం 2.2, నంద్యాల, అవుకు, దొర్నిపాడు 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

మొక్కల పెంపకాన్ని సమష్టిగా చేపట్టండి

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్



మొక్క నాటుతున్న కలెక్టర్ రాజకుమారి, చిత్రంలో మంత్రి ఫరూక్

నంద్యాల(సిటీ): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను సమష్టిగా తీసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. శుక్రవారం నూనేపల్లెలో నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన 75వ వన మహోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారులు రామకృష్ణ, బీఎస్ఎస్ మూర్తి, అటవీ శాఖ డీడీ అనురాగ్ మీన, డీఎఫ్ఓ శివ శంకర్ రెడ్డి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్ కుమార్, 21వ వార్డు కౌన్సిలర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు విరివిగా నాటి సంరక్షణ చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకొని సంరక్షించాలన్నారు.

మెడికల్ కళాశాలలో సౌకర్యాలు మెరుగుపరుస్తాం

నంద్యాల(అర్బన్): నంద్యాల పట్టణంలో నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీలో సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం జిల్లా మంత్రి మెడికల్ కళాశాలను పరిశీలించారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు అవసరమైన ఆర్ఓ ప్లాంట్, ఫర్నిచర్, ల్యాబ్ పరికరాలు, లెక్చరర్ గ్యాలరీ, హాస్టల్లో మౌలిక వసతుల కల్పన, తదితర అంశాలపై నివేదికలు ఇవ్వాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్ కుమార్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ ల్యాబ్‌లను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. మెడికల్ కళాశాలకు రెండు కొత్త బస్సులు వచ్చాయని డ్రైవర్లు లేని కారణంగా నిరుపయోగంగా ఉన్నాయని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామన్నారు.

బదిలీల గడువు పొడిగింపు

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును సెప్టెంబర్ 15వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 19 నుంచి 31వ తేదీలో బదిలీల ప్రక్రియ ముగియాలి. అయితే పభుత్వం మరో 15రోజులపాటు బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ క్రమంలో సెప్టెంబర్ 15వ తేదీలోపు బదిలీల ప్రక్రియను చేపట్టనున్నారు.

వీరికి మినహాయింపు

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల్లో వ్యవసాయ, అనుబంధ శాఖలకు చెందిన వారికి బదిలీల నుంచి మినహాయింపు లభించింది. ప్రస్తుతం ఖరీఫ్ పంటల నమోదు కార్యక్రమంలో జరుగుతున్నందున వీరికి బదిలీల నుంచి తాత్కాలికంగా మినహాయింపు లభించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు(గ్రేడ్–2), విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంటు, విలేజ్ సెరికల్చర్ అసిస్టెంటు, పశుసంవర్ధక శాఖ సహాయకులు, విలేజ్ ఫిషరీష్ అసిస్టెంటులకు ప్రస్తుతానికి బదిలీలు లేవు. వీరితో పాటు ఏఎన్ఎం గ్రేడ్–3/ వార్డు ఆరోగ్య కార్యదర్శిలకు కూడా బదిలీల నుంచి మినహాయింపు లభించింది.

కలుషిత నీరు కబళిస్తోంది

- పల్లెల్లో ప్రబలుతున్న అతిసార వ్యాధి
- రెండు నెలల్లో ఇద్దరు మృతి
- అలసత్వాన్ని వీడని అధికారులు
- మంచినీటి సరఫరాలో నిర్లక్ష్యం

ప్రజల ప్రాణాలతో అధికారులు చెలగాటమాడుతున్నారు. కలుషిత నీరు కబళిస్తుంటే చోద్యం చూస్తున్నారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, డయేరియా ముప్పు ఉన్నా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో వైఫల్యం చెందుతున్నారు. సమావేశాలు, సమీక్షలతోనే సరిపెడుతున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఓ వైపు దోమలు విజృంభించి విషజ్వరాలు వ్యాపిస్తుండగా, మరో వైపు తాగునీరు కలుషితమై అతిసార వ్యాధి ప్రబలుతోంది. రెండు నెలల్లో జిల్లాలో అతిసార వ్యాధితో ఇద్దరు మృతి చెందగా, పలువురు ఆసుపత్రుల పాలైనా అధికారుల్లో చలనం కరువైంది.

– బొమ్మలసత్రం



వేంపెంట వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న చిన్నారులు



మెరుగైన వైద్యం కోసం బాధితులను 108లో తరలిస్తున్న దృశ్యం

గ్రామీణ, పట్టణ ప్రజలకు సురక్షిత నీటిని అందించడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. మంచినీటి ట్యాంకుల శుభ్రత, పైప్‌లైన్ నిర్వహణ, క్లోరినేషన్, నీటి పరీక్షలు తదితరాలపై పర్యవేక్షణ లేకపోవడంతో మంచినీరు కలుషితమై ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. చాలాచోట్ల మంచినీటి పైపులు తుప్పుపట్టి మురుగు నీరు చేరుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నిత్యం తాగునీటి నమూనాలు పరీక్షించి యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సిన ప్రయోగశాలలు, అధికారుల నోర్లు మూతబడ్డాయని చెప్పవచ్చు. జిల్లాలో 732 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, జీఎల్ఎస్ఆర్ ట్యాంకులు 264, 778 పీడబ్ల్యూఎస్ ట్యాంకులు, 1,158 సిస్టర్నులు, 5,483 చేతిపంపుల ద్వారా 489 గ్రామాలకు సురక్షిత మంచినీటిని అధికారులు సరఫరా చేస్తున్నారు. అయితే నీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేయడంలో అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. జిల్లాలో తరచూ అక్కడక్కడా అతిసార వ్యాధి కేసులు బయట పడుతున్నా అధికారులు దాచిపెడుతున్నారు. తాజాగా కలుషిత నీరు కారణంగా పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామంలో బోయ లక్ష్మీదేవి (70) మృతి చెందింది. అదే గ్రామా నికి చెందిన చిన్న నాగన్న, శేషన్నలు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా రాములు, రమేష్ నంద్యాలలో చికిత్స పొందుతున్నారు. వీరితో పాటు గ్రామానికి చెందిన అమీర్‌బాషా, మద్దుజాబీ, బేషగమ్, ఇర్ఫాన్, రామచంద్రుడు, లలిత, శివతో పాటు మరో పది మంది గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నారు. ఈ గ్రామంలో కొన్ని రోజులుగా మంచినీరు అపరిశుభ్రంగా సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే వృద్ధురాలు చనిపోయారని గ్రామస్తులు వాపోతున్నారు.

నిబంధనలకు నీళ్లు..

- మంచినీటి నాణ్యత పరిరక్షణ కోసం అధికారులు చర్యలు తీసుకోకపోవటం వల్లే తరచూ అతిసార వ్యాధి ప్రబలుతోంది.
- గ్రామ పంచాయతీల్లో నీటి నాణ్యతను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వీడబ్ల్యూఎస్‌సీ సభ్యులతో కూడిన బృందం తరచూ పరిశీలించాలి.
- ట్యాంకుల తనిఖీ, పంప్‌లు, వాల్వ్ చాంబర్‌లు, నీటి ఒత్తిడిని గమనిస్తూ ఉండాలి.
- క్లోరినేషన్ విధానం, క్లోరోస్కోప్ ద్వారా క్లోరిన్ మోతాదును తరచూ పరిశీలిస్తుండాలి. ఈ సమాచారాన్ని లాగ్‌బుక్‌లో నమోదు చేసి డబ్ల్యూఎంఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి.
- వీధి కుళాయిలు, చేతిపంపులు, బోరు బావుల వద్ద నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- కనీసం ప్రతి నెల రెండుసార్లు వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలి. ట్యాంక్‌ను శుభ్ర పరిచిన తేదీని నోటీస్ బోర్డులో రాయాలి. వాటిని శుభ్రపరచకుండా తేదీలు మాత్రం రాస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేంపెంటలో అతిసార విజృంభణ

- ఒకరు మృతి, మరో 15 కొత్త కేసులు నమోదు



మృతి చెందిన బోయ లక్ష్మీదేవి(ఫైల్)

పాములపాడు: పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామంలో అతిసార వ్యాధి విజృంభిస్తోంది. శుక్రవారం ఒకరు మృతి చెందగా మరో 15 కేసులు కొత్తగా నమోదయ్యాయి. గ్రామంలోని బీసీ కాలనీ మసీదు వద్ద ఏర్పాటు చేసిన గొయ్యి వద్ద ఉన్న కుళాయి నీరు నిల్వ ఉండి కలుషితం అవుతోంది. ఈ నీరు పైపుల్లోకి వెళ్లడం వల్లే ప్రజలు అతిసారం బారిన పడుతున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గొయ్యిని పూడ్చేశారు. అయితే అతిసారంతో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ బోయ లక్ష్మీదేవి(70) మరణించింది. ఈ నెల 29న గ్రామంలో 13 కేసులు నమోదు కాగా.. మరో 15 కేసులు కొత్తగా వెలుగులోకి వచ్చాయి. వీరిలో ఆరుగురు చిన్నారులు ఉన్నారు. కొందరిని అంబులెన్స్‌లో ఆత్మకూరు, వెలుగోడుకు తరలించారు. ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. డీఎం అండ్‌హెచ్ఓ వెంకటరమణ, డీపీఓ మంజులా వాణి, ఆర్డీఓ దాసు, తహసీల్దార్ సుబద్రమ్మ, ఎంపీడీఓ గోపీక్రిష్ణ, డీఈ ఆర్‌డబ్ల్యుఎస్ విద్యాసాగర్‌లు గ్రామంలో పర్యటించారు. డాక్టర్లు నాగలక్ష్మి, గులాబ్ షా వైద్య సిబ్బందితో చికిత్సలు నిర్వహించారు. నీటిని శ్యాంపిల్ నిమిత్తం పంపగా కెమికల్ రిపోర్టు నెగెటివ్‌గా వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా కర్నూలు ల్యాబ్ నుంచి బయోలాజికల్ రిపోర్టు రావాల్సి ఉందని వివరించారు.

మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నాం

ఓహెచ్ఎస్ఆర్ లేకపోవడం వల్ల నేరుగా కుళాయిలకు నీరు సరఫరా అవుతోంది. వీధి కుళాయిలకు నీటిని నిలిపి వేయించాం. ప్రజలకు మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నారు. రెండు రోజుల్లో గ్రామంలో సాధారణ పరిస్థితిని తీసుకొస్తాం. – ఆర్డీఓ దాసు

శుద్ధి చేసిన నీటిని తాగాలి



వేంపెంట గ్రామంలో ట్యాంక్‌కు నీరు సరఫరా చేసే మోటర్ వద్ద పైపులు లీకేజీ కావటం వల్లే కలుషిత నీరు సరఫరా అయినట్లు గుర్తించాం. కలుషిత నీరు తాగి గురువారం 8 మంది, శుక్రవారం మరో 8 మంది వాంతులు, విరేచనాల కారణంగా అస్వస్థతకు గురయ్యారు. వారికి గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నాం. ఇంటింటికి క్లోరిన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశాం. శుద్ధి చేసిన నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలి. – వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

సెల్ ఫోన్ చోరీ

- ఫోన్‌పేలో రూ.1.80 లక్షలు మాయం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీకి చెందిన రుద్రప్ప అనే వ్యక్తి ఈనెల 24వ తేదీన పత్తికొండకు వెళ్లేందుకు బస్టాండ్‌లో ఉండగా సెల్‌ఫోన్ చోరీకి గురయ్యిందని టూటౌన్ పోలీ స్‌స్టేషన్ ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు. సెల్‌ఫో న్‌లోని ఫోన్‌పే యాప్ ద్వారా రూ.1.80 లక్షలు ఇతర ఖాతాకు బదిలీ అయ్యిందన్నారు. సెల్‌ఫోన్ పోవడంతో మరొక సెల్‌ఫోన్‌లో కొత్త సిమ్ వేసుకున్నాడని, ఆ సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడన్నారు. ఆన్‌లైన్‌లో నగదు పోవడంతో ఈ కేసును సైబర్ పోలీసులకు రెఫర్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాళికాంబకు బంగారు పాదాలు వితరణ



బంగారు పాదాలు ఈఓకు అందజేస్తున్న దాతలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటా వీధిలో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవ స్థానంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారికి బంగారు పాదా లను దాత శుక్రవారం విరాళంగా అంద జేశారు. ఈ సందర్భంగా దాత ఆరవేటి వాసు మాట్లాడుతూ పర్వదినాల్లో అమ్మవారి పూజకు వినియోగించేలా రూ. 27 లక్షల విలువైన 30 తులాల బంగారు పాదాలను అందజేశామ న్నారు. అనంతరం ఈ పాదుకలను గుడి ఆవ రణలో ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చ కులు వెంకటరమణాచారి, రాఘవేంద్రాచారి, విజయ్‌కుమార్, వరలక్ష్మి, రామకృష్ణ, నరసిం హ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు



శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులతో అధికారులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో 8 రోజులుగా నిర్వహిస్తున్న ఔత్సా హిక పారిశ్రామిక వేత్తలకు వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలపై శిక్షణ తరగతులు విజయ వంతంగా ముగిశాయి. చివరి రోజు శుక్రవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ప్రతాప రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ జనరేటర్ యువర్ బిజినెస్, స్టార్ యువర్ బిజి నెస్‌పై శిక్షణ ఇచ్చామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఎవరైనా కొత్తగా వ్యాపారం చేయాలనుకుంటున్నారో వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు శ్రీహరి స్టీల్స్ ఇండస్ట్రీ యల్‌ను సందర్శించి వివరించడం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో ఐఎల్ఓ శిక్షకులు శ్రీనివాసులు, రామాంజనేయులు, సిబ్బంది మస్తాన్, సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లకు 'చంద్ర'గ్రహణం

- 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలకు పింఛన్ల హామీ ఊసే లేదు
- 80 రోజులు గడిచినా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- కొత్త పింఛన్ల కోసం వెల్లువెత్తుతున్న దరఖాస్తులు
- మరోసారి మోసపోయామంటున్న అవ్వాతాతలు
- వలంటర్ వ్యవస్థకు మంగళం.. మళ్లీ రానున్న జన్మభూమి కమిటీలు!
- రెండు నెలల్లోనే 5,760 పింఛన్ల కోత



ఎన్నికల సమయంలో 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని పత్రికలకు ఇచ్చిన ప్రకటన

కర్నూలు(అగ్రికల్చర్): తమను గెలిపిస్తే 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రక టించారు. అధికారంలో వచ్చిన తర్వాత కొత్త పిం ఛన్ల ఊసే ఎత్తడం లేదు. పైగా ఉన్న పింఛన్లకు కోత పెడుతున్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా పింఛన్ మొత్తాన్ని రూ.4,000 పెంచుతామని చంద్ర బాబు హామీ ఇచ్చారు. అలాగే 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికి వృద్ధాప్య పింఛన్ కింద రూ.4,000 చెల్లిస్తామని ప్రకటించారు. ప్రతి ఎన్నికల సభలోనూ దీనిని పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లారు. టీడీపీ అనుకూల మీడియా కూడా దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటై 80 రోజులు గడుస్తు న్నా... కొత్త పింఛన్ల ఊసే లేకుండా పోయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 50 ఏళ్ల బీసీ, ఎస్టీ, ఎస్సీ, ముస్లింలు దాదాపు 2 లక్షల మంది ఉంటారు. వీరిలో కనీసం లక్ష మంది అర్హులు ఉంటారు. వీరం దరూ కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే వీరికి ఇప్పట్లో కొత్త పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా లేదు. ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న వారిలో అనర్హులు భారీగా ఉన్నారని, వారిని తీసేసిన తర్వాతనే.. ఆ స్థానంలోనే కొత్త పిం ఛన్లు ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది.

వెల్లువెత్తుతున్న దరఖాస్తులు..

చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తమకు వృ ద్ధాప్య పింఛన్ వస్తుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం లు ఆశలు పెట్టుకున్నారు. రోజులు, నెలలు గడు స్తున్నా.. కొత్త పింఛన్ల మాటే వినబడని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు, డీఆర్‌డీఏ ఆఫీసుల చుట్టూ 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త పింఛన్లపై తమకు మార్గదర్శకాలు రాలేదని అధికా రులు వారిని వెనక్కి పంపుతున్నారు. మరోవైపు టీడీపీ నేతలతో పింఛన్లపై ఫిర్యాదులు చేయించడం ..దీనిని అవకాశంగా తీసుకొని పింఛన్‌దారులకు నోటీసులు ఇవ్వడం, ఆ తర్వాత తొలగించడం వం టి కార్యక్రమాలు జరుగుతున్నాయి.

మోసపోయిన అవ్వాతాతలు

50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటూ ఎన్నికల సమయం లో చంద్రబాబు ఊరూరా ప్రచారం చేశారు. చంద్ర బాబు మాటలను నమ్మి గెలిపించారు. అయితే మోసపోయామని తెలుసుకోవడానికి ప్రజలకు ఎన్నో రోజులు పట్టలేదు. అధికారం చేపట్టి 80 రోజులు దాటినప్పటికి 50 ఏళ్లకే పింఛన్ లేదు... సూపర్-6 హామీలు లేవు. వెరసి 2024-25లో హామీల అమలు లేనట్లేనని సంకేతాలు ఇస్తున్నారు. ఒకవైపు పెద్ద ఎత్తున అప్పులు తెస్తున్నారు. మరో వైపు గత ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని పేర్కొంటున్నారు. ప్రజలకు ఎంతో చేయాలని ఉన్నా.. చేయలేని పరిస్థితి ఉందని పరోక్షంగా చేతులెత్తేస్తున్నారు. దీనిని బట్టి అవ్వాతాతలతో పాటు అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబును నమ్మి మరోసారి మోసపో యామని నిర్ధారణకు వచ్చారు.

వలంటీర్ వ్యవస్థకు మంగళం

వైఎస్సార్‌సీపీ పాలనలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఎటువంటి రిమార్కులకు తావు ఇవ్వకుండా పిం ఛన్లు పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఓట్ల కోసం వలం టీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వేతనాలను రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన తర్వాత వలంటీర్ వ్యవస్థ ఊసే లేకుండా పోయింది. జూలై, ఆగస్టు నెల పింఛన్ల పం పిణీ కార్యక్రమం అభాసుపాలు అయింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పిం ఛన్లు పంపిణీ చేయాలనే ఆదేశాలు ఉండగా.. ఇది అమలు కాలేదు. 30 శాతం వరకు మాత్రమే ఇంటి దగ్గర పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 70 శాతం రచ్చబండ, ప్రధాన కూడళ్లు, సచివాల యాల్లో పంపిణీ చేశారు.

5,760 పింఛన్ల కోత

కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత నెలానెలా పింఛన్లలో కోత పడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఏడాది జూన్ నెలతో పోలిస్తే సెప్టెంబరు నెల పింఛన్లలో 5,760 కోత కోశారు. పింఛన్‌లను అడ్డగోలుగా కోస్తుండటం తో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ ఏడాది జూన్ నెలలో 4,77,389 పింఛన్లు ఉండ గా.. సెప్టెంబరు నెలలో 4,71,629కు తగ్గాయి. కేవలం రెండు నెలల వ్యవధిలోనే 5,760 పిం ఛన్లను తొలగించారు. తొలగించిన వారి స్థానం లో కొత్త లబ్ధిదారులనూ ఎంపిక చేయలేదు. ఒకవైపు నెలనెలా పింఛన్‌లలో కోత విధిస్తూ కొత్త పింఛన్‌లు ఇవ్వడంపై నోరు విప్పడం లేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా...

వైఎస్సార్‌సీపీ హయాంలో ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్‌లు ఇచ్చేవారు. ప్రతి ఏటా జనవరి, జూలై నెలల్లో అర్హులైన వారందరికీ మంజూరు చేసేవారు. రాజకీయాలకు అతీతంగా.. అర్హతనే ప్రామాణికంగా తీసుకునేవారు. గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే చాలు.. ఆటోమేటిక్‌గా పింఛన్ మంజూరయ్యేది. వైఎ స్సార్‌సీపీ ఐదేళ్ల హయాంలో కొత్త పింఛన్‌లు 1.20 లక్షలకు పైగా ఇచ్చారు. 2014 నుంచి 2019 వరకు ఉన్న టీడీపీ పాలనలో కొత్త పింఛన్ పొందాలంటే తలప్రాణం తోకకు వచ్చేది. జన్మ భూమి కమిటీలను ముడుపులతో ప్రసన్నం చేసుకుంటేనే పింఛన్ ఇచ్చేవారు. జనవరి నుంచి మళ్లీ జన్మభూమి-2 కార్యక్రమం చేపడుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటిం చారు. జన్మభూమితో పాటే జన్మభూమి కమిటీలు కూడా రాబోతున్నాయని ప్రచారం జరుగుతోంది. జన్మభూమి కమిటీలు వస్తే అర్హతకు పాతరే.. ముడుపులు ఇచ్చిన వారికి, అనర్హులకే అందలం అనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి.

కొత్త పింఛన్లు వెంటనే ఇవ్వాలి



టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు ఎన్నికల సమయంలో 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తామని ప్రకటించారు. ఇది మాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. చంద్ర బాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి 80 రోజులు గడుస్తోంది. మేం ముస్లిం సామాజిక వర్గానికి చెందిన పేద కుటుం బానికి చెందిన వారం. నా వయస్సు ప్రస్తుతం 57 ఏళ్లు. నాకు వృద్ధాప్య పింఛన్‌కు అర్హత ఉంది. ఎన్ని కల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్లు నిం డిన వారికి వెంటనే పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలి.

– బషీర్, కౌతాళం, కర్నూలు జిల్లా

పారా రోయింగ్‌లో సత్తా చాటిన ప్యాపిలి వాసి



పారా రోయింగ్‌లో పాల్గొన్న వెంకట నారాయణ, అనిత

ప్యాపిలి: పారిస్‌లో జరుగుతున్న పారా ఒలింపిక్స్‌లో పారా రోయింగ్ విభాగంలో నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన కొంగనపల్లి వెంకటనారాయణ సత్తా చాటారు. రాజస్థాన్‌కు చెందిన అనితతో కలసి శుక్ర వారం పారా రోయింగ్‌లో భారత్ తరఫున తలప డ్డారు. థాయిలాండ్, ఆస్ట్రేలియా, యూఎస్ఏ, ఉక్రే యిన్, ఫ్రాన్స్ తదితర దేశాలతో తలపడిన వెంకట నారాయణ, అనిత ఐదో స్థానంలో నిలిచారు. రెండు కిలోమీటర్ల దూరాన్ని వీరు 8 నిమిషాల ఆరు సెకె న్లలో చేరుకున్నారు. శనివారం ఉక్రేయిన్, మెక్సికో తది తర దేశాలతో తలపడనున్నారు.

గణేష్ మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతి

బొమ్మలసత్రం: వినాయక చవితి సందర్భంగా విగ్రహం ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు ఆన్‌లైన్‌లో సులువుగా మండపాల అనుమతి తీసుకోవచ్చని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా తెలిపారు. వినా యక మండపం ఏర్పాటు చేసే కమిటీ నిర్వాహకులు జ్ఞ్బుటజ్జిట్టుర్తి. ఞ్భ ద్వారా ఆన్‌లైన్‌లో సభ్యుల వివరాలు, మంటపం ఏర్పాటు చేసే ప్రదేశం, పోలీ స్టేషన్ పరిధి, విగ్రహం ఎత్తు, ప్రతిష్ట, నిమజ్జన తేదీ ప్రదేశం తదితర అంశాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. 7995095800 నెంబర్‌కు మంటపం ఏర్పాటు చేసే నిర్వాహకులు వారి సెల్ నుంచి హాయ్ అని మెసేజ్ చేయాలన్నారు. వెంటనే మొబైల్‌కు వచ్చిన వివరాలను నమోదు చేస్తే చాలని వివరించారు. ఇలా చేస్తే పురపాలక, అగ్నిమాపక, విద్యుత్, పోలీస్ శాఖల నుంచి అనుమతులు లభిం చి వాటిని క్యూఆర్‌కోడ్ ద్వారా అనుమతి పత్రం లభి స్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అమ్మ పేరుతో మొక్క..పర్యావరణానికి రక్ష



వనమహోత్సవం పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం



మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

కర్నూలు కల్చరల్: అమ్మ పేరుతో నాటే మొక్క పర్యా వరణానికి రక్షగా ఉంటుందని వక్తలు అన్నారు. శుక్ర వారం రాయలసీమ యూనివర్సిటీలో వన మహోత్స వం -2024కు సంబంధించి ఏపీ ప్రభుత్వం - అటవీ శాఖ ఆధ్వర్యంలో 'అమ్మ పేరుతో ఒక మొక్క నాటం డి' కార్యక్రమం నిరన్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి పి. శ్యామల, రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని మొక్కలు నాటా రు. జిల్లా అటవీ శాఖ అధికారి పి.శ్యామల మాట్లా డుతూ కర్నూలు జిల్లా భౌగోళిక విస్తీర్ణంలో 4 శాతం మాత్రమే అడవులు విస్తరించి ఉన్నాయన్నారు. వన సంపద పెంచేందుకు ఆర్‌యూలో 2000 మొక్కలు నాటామన్నారు. ఆర్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటే శ్వర్లు మాట్లాడుతూ యువత సహజ వనరుల సంరక్ష ణకు పాటు పడాలన్నారు. అనంతరం అమ్మపేరుతో ఒక మొక్క నాటండి పోస్టర్లను అతిథులు ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య సుందరనాందన పుచ్చ, డీన్ ఆఫ్ రీసెర్చ్ ఆచార్య విశ్వనాథరెడ్డి, ఆర్‌యూసీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి, కర్నూలు, ఆదోని డివిజన్ల ఎఫ్ఆర్‌ఓలు విజయకుమార్, తేజశ్విని, వర్సిటీ ఎన్ ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, గ్రీన్ కో కోఆ ర్డినేటర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేతలు అక్కడ ప్రత్యేకం

ఆర్‌యూలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన వనమహోత్సవంలో కర్నూలు, కోడుమూరు జనసేన పార్టీ సమన్వయకర్తలు అర్షద్, రాంబాబు దర్జాగా పాల్గొన్నారు. మొక్కలు నాటి సభలో వేదికపై ఆశీనులై ఉపన్యాసాలు ఇచ్చారు. వన మహోత్సవం కార్య క్రమంలో తన ఫొటోతో బ్యానర్ కట్టకపోవడంతో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కార్యక్రమానికి గైర్హాజరైనట్లు చర్చించుకోవడం కనిపించింది. స్వగ్రామం పసుపుల పరిధిలోని ఆర్‌యూలో నిర్వహి స్తున్నప్పుడు తన బ్యానర్ ఎందుక కట్టలే దని అస హనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

నర్సింగ్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్!

- నలుగురు ట్యూటర్ల తొలగింపు



పరీక్ష రాస్తున్న నర్సింగ్ విద్యార్థులు, పర్యవేక్షిస్తున్న అధికారి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో నిర్వహిస్తున్న జనరల్ నర్సింగ్ సప్లిమెం టరీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగు తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఈ నేపథ్యంలో నలుగురు ట్యూటర్లను ఆసుపత్రి సూపరింటెండెం ట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి తొలగిం చడం చర్చనీయాంశమైంది. వీరి స్థానంలో నలుగురు అధికారులను పర్యవేక్షణకు నియమించారు. ఇందులో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ వినోదిని ఉన్నారు. ఈ నెల 27వ తేదీ నుం చి వచ్చే నెల నాల్గవ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తుండగా, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లోని 50 నర్సింగ్ స్కూళ్ల నుంచి 400 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. ఆసుపత్రిలోని ఆడిటోరియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగు తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యం గా ఆసుపత్రి బయట ఉన్న ఓ జిరాక్స్ సెంటర్ నుంచి విద్యార్థులు మైక్రో జిరాక్స్‌లను తీయించుకుని మరీ పరీక్ష రాస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. కాపీయింగ్‌కు పలువురు ఇన్విజిలేటర్లు, ట్యూటర్లు సహకరిస్తుండగా ఓ ఉద్యోగి ఆయా నర్సింగ్ స్కూల్‌ల నుంచి మామూళ్లు వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోపణలు రావడంతో ఆసుపత్రి అధికారులు చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం.

వరలక్ష్మీ.. కటాక్షించు తల్లీ!

- శ్రీశైలంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం
- చెంచు గిరిజనులకు ప్రత్యేక అవకాశం



సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న చెంచు, ఇతర మహిళలు,



ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మీదేవి

శ్రీశైలంటెంపుల్: ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా శ్రీశైల దేవస్థానం నాల్గవ శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉచిత సామూ హిక వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించింది. ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న చంద్రావతి కల్యా ణమండపంలో ఈ వ్రతాలను ఏర్పాటు చేశారు. సామూహిక వరలక్ష్మీవ్రతానికి చెంచు గిరిజన భక్తులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. శ్రీశైలం ఐటీడీఏ అధికారుల సహకారంతో జిల్లాలోని ఆత్మకూరు, బండిఆత్మకూరు, శ్రీశైలం, ఆళ్లగడ్డ, పల్నాడు జిల్లాలోని మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, ప్రకాశం జిల్లాలోని దోర్నాల, యర్రగొండపాలెం తదితర ప్రాంతాల నుంచి సుమారు 600 మంది చెంచు భక్తులు, 900 మంది సాధారణ భక్తులు పాల్గొన్నారు. ఈ వ్రతానికి కావాల్సిన పూజాద్ర వ్యాలన్నింటిని దేవస్థానమే సమకూర్చింది. వ్రత కార్యక్రమంలో పాల్గొనే ముత్తైదువుల కోసం వేర్వేరు కలశాలను నెలకొల్పి శాస్త్రోక్తంగా వ్రతాన్ని జరిపించారు. ఆలయ అర్చకులు వ్రత కథను పఠించి వ్రత మహిమావిశేషాలను భక్తు లకు తెలియజేశారు. చివరిగా నీరాజన మంత్రపు ష్పాలను జరిపి వ్రతసమాప్తి చేశారు. వ్రతాన్ని జరిపించుకున్న మహిళలందరికీ చీర, రవిక వస్త్రం, పూలు, గాజులు, కంకణాలు, తులసి మొక్క, శ్రీశైలప్రభ మాసపత్రిక, మూడు రకాల ప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామిఅమ్మవార్ల దర్శనం కల్పించారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణా ధికారి డి.పెద్దిరాజు దంపతులు, ఆలయ ఏఈవో హరిదాసు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బం ది పాల్గొన్నారు.

నంద్యాల డీఎస్పీ యుగంధర్‌బాబుకు పదోన్నతి

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ డీఎస్పీ యుగంధర్‌బాబుకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ పోలీస్ ఉన్నతాధికా రులు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా కొన్ని రోజుల క్రితం నంద్యాల పట్టణ డీఎస్పీగా యుగంధర్‌బాబు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన అనతికాలంలోనే ఆయనకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది



పెద్దహోతూరులో చోరీ

ఆలూరు రూరల్: మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో గురు వారం రాత్రి చోరీ జరిగింది. బాధి తుడు, పోలీసులు తెలిపిన వివరా లు.. పెద్దహోతూరు గ్రామానికి చెం దిన తిక్కన్న స్థానిక ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం బతుకుదెరువు కోసం కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ జిల్లాలకు వలస వెళ్లాడు. శుక్రవారం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో గమనించిన కాలనీ వాసులు బుడ్డన్న చెప్పడంతో గ్రామానికి వచ్చాడు. ఇం టి తలుపు తాళం పగలగొట్టి దొం గలు బీరువాలో ఉంచిన 4 తులాల బంగారు, 30 తులాల వెండి ఆభ రణాలు, తన భార్య డెలవరీ కోసం దాచుకున్న రూ.60 వేల నగదును దోచుకెళ్లారు. దొంగతనం జరిగినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘన స్థలాన్ని చేరుకుని వివరాలు తీసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి వేలి ముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహులు తెలిపారు.